క్లుప్తంగా

సమగ్ర సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి



వివరాలు నమోదు చేయిస్తున్న భోజారెడ్డి

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. సోమవారం భీంపూర్ మండలంలోని వడూర్‌లో నిర్వహించిన సర్వేలో డీసీసీబీ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల వివరాలతో పాటు పూర్తి సమాచారాన్ని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, తహసీల్దార్ నలందప్రియ, సంజీవ్ రెడ్డి, హనుమాన్ దాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి'

కైలాస్‌నగర్: సోయా కొనుగోళ్లకు సంబంధించి రైతుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదనే బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం పూర్తి అవాస్తవమని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 6,551 మంది రైతుల నుంచి 1,12,522 క్వింటాళ్ల సోయా కొనుగోలు చేయగా.. సుమారు 1500 మంది రైతులకు రూ. 11.82 కోట్ల రూపాయలను చెల్లించినట్లుగా మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారన్నారు. సోయా కొనుగోళ్లకు సంబంధించిన రైతులకు వారి వారి ఖాతాలకు డబ్బులు జమ చేయడం జరుగుతుందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని పేర్కొన్నారు.

సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్వగ్రామమైన కల్లుగూరి గ్రామంలో సోమవారం సర్వేలో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబ వివరాలను నమోదు చేయించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని సర్వేలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గ్రహణమొర్రి శిబిరానికి స్పందన



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో ఏవీఆర్ డెంటోఫిషియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రహణమొర్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి రిఫెర్ చేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ గ్రహణమొర్రితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా చేపడుతున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ప్రోగ్రాం అధికారి వైసీ శ్రీనివాస్, డైస్ మేనేజర్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి

గుడిహత్నూర్: విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధి సాంగ్లే చంద్రకాంత్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున స్కాలర్‌షిప్ అందించారు. తమ సంస్థ ద్వారా ఇది వరకు అనేక మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంతో పాటు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దేవదాస్, సోషల్ వర్కర్ అంకుష్ లోఖండే, సుభాష్ జాడి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన నూతన కమిషనర్

కైలాస్‌నగర్: నూతనంగా పదోన్నతి పొందిన మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఘనంగా సత్కరించారు. ఆర్వోగా విధులు నిర్వర్తిస్తూ.. జాదవ్ కృష్ణ ఇటీవలే మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. అభినందనలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు.

అన్నదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం అన్నదాన (బిక్ష) కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బత్తుల అశోక్ స్వామి నిర్వహించిన బిక్ష కార్యక్రమంలో పలువురు స్వాములు పాల్గొన్నారు. అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించారు.

అబుల్ కలాం ఆజాద్ జయంతి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, అజీం, జవ్వాద్ అన్సారి, రాహుల్, తిరుపతి, ఫహీం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని టీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర పాఠశాల, కళాశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐజీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఐజీడీఎస్ రీజినల్ మేనేజర్ పల్లవి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. మంచి పోషకాలు గల ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వివరించారు. అంతకు ముందు విద్యార్థులకు వివిధ అంశాల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎంసీ డాక్టర్ అలైఖ్య, జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కాంబ్లే, వైస్ ప్రిన్సిపాల్ గోవర్ధన్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఉర్దూ భాషాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. భారతరత్న, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉర్దూ రిపోర్టర్లను పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. ఉర్దూ భాషకు అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



బహుమతులు అందజేస్తున్న నాయకులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఆదిలాబాద్‌టౌన్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఒక్క విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు రఘు, యాఖుబ్ అలీ, చంద్రకాంత్, ముబారక్, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ..

తెలంగాణ ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమన్ సొసైటీ అధ్యక్షుడు అర్బాత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

విద్యా దినోత్సవం సందర్భంగా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బజరంగ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మైనార్టీ యువకులు సోమవారం నిర్వహించారు. స్థానిక షాదీఖానాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అజార్ ఖాన్, షేక్ షాకీర్, ఇర్షాద్ అలీ, అబ్రార్, నాసర్, జావీద్, ఇమ్రాన్, జుబేర్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గురుకులాల ఏర్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ మండలానికి మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మైనార్టీ గురుకుల పాఠశాలలో అబ్దుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో వేల సంఖ్యలో విద్యార్థులు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. జయంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యూనిస్ సలీం, కృష్ణారెడ్డి, గాడ్గే సూభాష్, శ్రీకాంత్‌రెడ్డి, పాండురంగ్, మహిముద్, నర్వేడ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని సిరిచెల్మ మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమగూడ నుంచి సిరికొండ మండలంలోని జెండగూడ వరకు రూ 2.50 కోట్లతో నిర్మించే బీటీరోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సిరికొండ: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని జెండగూడ గ్రామానికి సందర్శించారు. రోడ్డు నిర్మాణానికి రూ. 2.50 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకోవాలన్నారు.

కనకాయిని అభివృద్ధి చేస్తా

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కనకాయి అటవీ ప్రాంతంలో కనకాయి, బంద్రేవ్ జలపాతాలు, అతి పురాతన ఆలయం కనకదుర్గ ఆలయంకు రహదారి, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం గిర్నూర్ గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కనకాయి అటవీ ప్రాంతానికి చేరుకుని కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కనకాయి, బంద్రేవ్ జలపాతాలను సందర్శించి, వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మహేందర్, కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, రాజారాం, వినోద్, సాయిచైతన్య, ఉపేందర్, దుబ్బుల చంద్రశేఖర్, దీసీ రమణ, చట్ల గజ్జయ్య, కవిందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

నేరడిగొండ: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. మండలంలోని వడూర్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. విద్యాశాఖ సమన్వయంతో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ రకాల కథల పుస్తకాలు, పఠన సామగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చని తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్, ఉపాధ్యాయులు, రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ ఎండీ ఆదిల్ అలీ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠాలు చదివిస్తున్న ఎంఈవో భూమారెడ్డి

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. సోమవారం మండలంలోని ఈశ్వర్‌నగర్, ఏమాయికుంట గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబసభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు: కుటుంబ సమగ్ర సర్వేను ఎలాంటి తప్పిదాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని బరంపూర్, ఖోడద్, ఆర్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. మూడు రోజులుగా 1470 కుటుంబాలను సర్వే చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధీర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, చంద్రశేఖర్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

నార్నూర్: సర్వేలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఏపీఎం మైస రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దుర్గానగర్, సేవాలాల్‌నగర్, అంబేద్కర్‌నగర్, జీన్‌గూడ, ముస్లింగూడ, అన్నాభావు సాఠెనగర్‌లో సర్వే చేస్తున్న 10 మంది ఎన్యుమరేటర్స్ సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఎటువంటి అపోహాలు పెట్టుకోకుండా ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన వివిధ రకాల రుణాలు అందిస్తున్నామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. తాంసి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో కేశవ్ ఆదాయ, వ్యయ, పొదుపు, అప్పుల నివేదికను సంఘ సభ్యులకు చదివి వినిపించారు. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా అవసరమైన రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘం ముఖ్య ఉద్దేశమన్నారు. వైస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్లు సామ కవిత, బుజ్జన్న, రమేశ్, చంద్రన్న, కార్యదర్శులు సుధాకర్, సిద్ధార్థ్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కార్తీక దీపోత్సవానికి తరలిరావాలి

ఆదిలాబాద్: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించే కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి తరలిరావాలని వేద పండితుడు మేఘరాజ్ శర్మ కోరారు. సోమవారం డైట్ కళాశాల మైదానంలో దీపోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను సమితి సభ్యులతో కలిసి పరిశీలించారు. లోక కల్యాణార్థం, భక్తులకు భగవద్ అనుగ్రహం కోసం సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే మహిళలకు ఉచితంగా సామగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, గెడం మాధవ్, కందుల రవీందర్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమితి సభ్యులు

ఆలయంలో కార్తీక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: కార్తీ మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. సోమవారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శివలింగానికి, పంచామృతం, పుష్పాభిషేకం, పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయాభివృద్ధికి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, రమేశ్, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, భూమన్న, శ్రీకాంత్, వెంకన్న, నారాయణరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: మండలంలోని అర్లి గ్రామంలో విఠలేశ్వర రుక్మాబాయి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, పల్లకి ఊరేగింపు నిర్వహించారు. వేద పండితుల మంత్రోత్సవాల మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టన్న, రమేశ్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటస్వామి, సురేశ్, అశోక్, బుచ్చన్న పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

'కాంగ్రెస్ పేదల పార్టీ'



పార్టీలో చేరిన వారితో కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పని చేస్తుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దొండరిగూడ, రాము గూడ, గుండం లొద్ది, పాకిడి గూడతో పాటు పలువురు చాంద(టి) గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ప్రతీ ఊరిలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పేదలకు పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, మునిగెల నర్సింగ్, కౌన్సిలర్లు బండారి సతీష్ పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకుంటాం



పత్తిని పరిశీలిస్తున్న చైర్మన్

బోథ్: పత్తి రైతులు నష్టపోకుండా వారిని ఆదుకుంటామని, రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లాలోని ఎనుమాముల మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు పత్తి కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. అక్కడ వ్యాపారులు, అధికారులు అనుసరిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. మార్కెట్ పత్తి విభాగం ప్రత్యేక అధికారి శ్రీరామోజు రాము శాలువాతో సత్కరించారు. ఆయన వెంట నాయకులు పసుల చంటి, నాయకులు గాజుల పోతన్న ఉన్నారు.

సన్మానం

బోథ్: బోథ్ పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లెపూల శివారెడ్డిని మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎలుక రాజు సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. బుడుగు బలహీనవర్గాల అభివృద్ధికి అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడ లక్ష్మణ్, మునేశ్వర్ సోమన్న, రమణయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత, నాణ్యత పాటించాలి



నిర్వాహకులతో సమావేశమైన సీఐ

ఇంద్రవెల్లి: హోటల్స్, దాబా, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు స్వచ్ఛత, నాణ్యత పాటించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఫుడ్‌పాయిజన్ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. నిర్లక్ష్యం చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఉట్నూర్‌రూరల్: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏసీఎంవో అర్క జగన్‌లు అన్నారు. సోమవారం ఉట్నూర్ కేబీ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ బాలుర అథ్లెటిక్స్, ఖోఖో పోటీలను ప్రారంభించారు. గిరిపుత్రుల్లో క్రీడలతో శరీర దారుఢ్యం, సహజ నైపుణ్యాలుంటాయని వీటిని వెలికి తీసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతరావు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారులు ఖమ్మంలో ఈనెల 17 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమేశ్, ప్రధానోపాధ్యాయులు ఉత్తం, హేమంత్, పవార్ లక్ష్మణ్, జలపత్, కోచ్‌లు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఏపీవో మనోహర్

జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు జోనల్ స్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఉట్నూరులోని కేబీ కాంప్లెక్స్‌లో జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 14, 17 బాలుర అథ్లెటిక్స్ జోనల్ స్థాయి పోటీల్లో నాలుగు పతకాలతో మెరిశారు. అండర్ 14 విభాగంలో హైజంప్‌లో ఎస్. చరణ్ స్వర్ణం, 100 మీటర్ల పరుగులో ఎం. నాగపునీత్ రజతం, షాట్‌పుట్‌లో అర్జున్ కాంస్య పతకాలు సాధించారు. అండర్ 17 విభాగంలో 400 మీటర్ల హర్డిల్స్‌లో డి. యువరాజ్ స్వర్ణ పతకం గెలుచుకున్నట్లు కోచ్ రమేశ్ తెలిపారు.



హైజంప్‌లో విజేతగా నిలిచిన చరణ్‌తో కోచ్ రమేశ్

ట్రైబల్ యూనివర్సిటీ మంజూరుకు కృషి



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే ఉట్నూర్ మండల కేంద్రంలో ట్రైబల్ యూనివర్సిటీ మంజూరుకు కృషి చేస్తానని ఆల్ఫోర్స్ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు, గ్రంథాలయంలో ఉపాధ్యాయులను కలిసి మద్దతు తెలపాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అమలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు.

అధిక సాంద్రత పద్ధతితో దిగుబడి

తలమడుగు: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లింగి గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తిని పరిశీలించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్, దిలీప్, మల్లేష్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలు అభినందనీయం

బోథ్: మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని ఎంపీడీవో రమేశ్ అన్నారు. ఇటీవల సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కాగా సోమవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. చిన్న వయసులో మంచి పేరు సంపాదించుకున్న వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ మాసం అభినందించారు. 100 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.